క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

నర్సంపేట : పట్టణంలోని గీతాంజలి డీజీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న బి.శ్వేత జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమె అండర్–14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రోలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే లాంగ్ జంప్‌లో మూడో స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న నేషనల్ సౌత్ జోన్ పోటీల్లో జిల్లా తరఫున శ్వేత పాల్గొననుంది. శ్వేతను గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, ప్రిన్సిపాల్ ప్రవీణ్ శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ వంగల వసుంధర, అజయ్, వెంకన్న, ధినేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, పర్వతగిరి మండలాల్లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాంకు ఆ పార్టీ, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఊరూరా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా సమ్మయ్య, ఈసంపెల్లి బాబు, జిల్లా నాయకుడు కడియాల వీరాచారి, అభ్యుదయ వాదుల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ చింతకింద కుమారస్వామి, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బొక్కల శ్యాం కుమార్, ఆర్‌ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే దళితుల అభివృద్ధి

నెక్కొండ : కాంగ్రెస్ హయాంలోనే దళితుల అభివృద్ధి జరుగుతుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దీక్షకుంటలో చేపట్టిన మాల కులస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. మాల కులస్తుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవ చూపి సీడీఎఫ్ నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ క్రమంలోనే అన్ని వసతులతో కూడిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పనులు చేపట్టామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం అవసరమైన పనులు మంజూరు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, పెండ్యాల హరిప్రసాద్, చల్లా శ్రీపాల్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

పర్వతగిరి : మండలంలో నేటి (శనివారం) నుంచి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 16వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులను బృందాలు తనిఖీలు చేస్తాయని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఎస్‌టీఎం సాయి జ్ఞానేందర్, ఎస్‌ఆర్‌పీ చెన్నకేశవులు, ఏపీఓ సుశీల్‌కుమార్, ఈసీ రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట శివారులోని పాకాల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్ యజమానులు మాదూరి రాజు, లింగాల సాయిమల్లు, డ్రైవర్ ఇండ్ల మహేందర్, మేకల వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వినతి

నర్సంపేట : విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఎంఐఎస్ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తండ రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజేందర్, రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి గీత, నాయకులు శోభన్, భాస్కర్, శ్రీను, సరిత, అరుణ, సునీల్ పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యదర్శిగా రవీందర్



నల్లబెల్లి : బీజేపీ మండల కార్యదర్శిగా మండలంలోని నందిగామకు చెందిన బొగ్గుల రవీందర్‌ను నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొద్దురెడ్డి ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో రవీందర్ మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



నర్సంపేట : అన్నదానం చేస్తున్న రామానంద్



గీసుకొండ : ఉత్సవాల్లో సీఐ, తదితరులు



రాయపర్తి : మైలారంలో..



నర్సంపేట రూరల్ : కుంకుమార్చనలో మహిళలు

నర్సంపేట : నియోజకవర్గ వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. వినాయక విగ్రహాల వద్ద నిర్వాహకులు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన, ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో నెహ్రూ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలకు వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్ వనజ హాజరై గణపతిని పూజించారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని సర్వాపురం ఎస్‌బీఐ కాలనీ గణపతి మండపం వద్ద వేదపండితులు శివాగణేష్ ఆధ్వర్యంలో కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో శీలం స్వరూప, శీలం మంజుల, సావిత్రి, స్వరూప, తదిరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని గీసుకొండ, కొమ్మాలలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా సాగాయి. జిల్లా కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి–స్వప్నదేవి దంపతుల సహాయంతో అన్నదానం చేశారు. గీసుకొండలో శ్రీ లక్ష్మీనర్సింహ యూత్ అసోసియేషన్, కొమ్మాలలో సాధన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సీఐ బాబూలాల్, బాలకిశోర్‌రెడ్డి సతీమణి స్వప్నదేవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు మద్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, దౌడు బాబు, రాంబాబు, సునీల్, కొమ్ము శ్రీకాంత్, యూత్ అధ్యక్ష, కార్యదర్శులు కొండం గణేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని మైలారంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉల్లెంగుల నర్సయ్య 21 వినాయక విగ్రహాలకు రూ.5 వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, గబ్బెట బాబు, నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలో శివపుత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి సందడి చేశారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మహిళలు కుంకుమార్చన చేశారు. పురోహితుడు కొండా కృష్ణస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్ధన్నపేట : పట్టణంలో శ్రీధర్మశాస్తా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో అనిమిరెడ్డి రాంచంద్రారెడ్డి దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు కోమాండ్ల వెంకట్‌రెడ్డి, గద్దం సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని ఖానాపురం, ధర్మారావుపేట, రంగాపురం, తదితర గ్రామాల్లో అన్నదానం చేశారు. ఖానాపురంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై రఘుపతి ప్రారంభించారు.

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో వివేకానంద పరపతి సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద అన్నదానం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీనివాస్, అధ్యక్షుడు చెన్నబోయిన దిలీప్, కార్యదర్శి బోనగిరి సతీశ్, కోశాధికారి వెంకటమల్లు, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలోని మూసినవాడలోని గణేష్ మండపంలో వద్ద వేదమంత్రోచ్ఛరణల మధ్య మహిళలు విఘ్నేశ్వరుడికి కుంకుమపూజ చేశారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



వర్ధన్నపేట : పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : హైదరాబాద్‌లో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంపై దాడికి నిరసనగా ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ ఇంటి దిగ్బంధానికి బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో వర్ధన్నపేట, గీసుకొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, పర్వతగిరి, ఖానాపురం, సంగెం, రాయపర్తి, నెక్కొండ, నల్లబెల్లి మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీపై విడుదల చేశారు.

కమ్యూనిస్టులే 'పోరాట' వారసులు



నర్సంపేట రూరల్ : ర్యాలీలో రమేశ్, నాయకులు



పర్వతగిరి : నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : కమ్యూనిస్టులే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. ఈనెల 17 వరకు తలపెట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా నర్సంపేట మండల మాధన్నపేటలో శుక్రవారం భారీ కావ్వాత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు మాత్రమే పాల్గొన్నారని స్పష్టం చేశారు. బూర్జువా పార్టీలు చరిత్రను వక్రీకరించే యత్నం చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజాపోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగాల రాగసుధ, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకులు కేశెట్టి సదానందం, రమేశ్, సాంబయ్య, గాదెగోని బాబు, తదితరులు పాల్గొన్నారు.

హితకారిణి సేవా సంఘం ఆధ్వర్యంలో..

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో హితకారిణి సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటిక మల్లయ్య ఆధ్వర్యంలో గటిక నర్సయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య విగ్రహానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాలక కవిత, దామెర కృష్ణ, విక్టోరియా, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పర్వతగిరి : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు కోరారు. 'సీజనల్ వ్యాధులు–జాగ్రత్తలు' అంశంపై మండలంలోని చింతనెక్కొండలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. తద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. భోజనానికి ముందు చేతులు సరైన రీతిలో శుభ్రం చేసుకునేలా విద్యార్థులకు, బాలలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ నవ్యకృష్ణ, ఏఎన్‌ఎం రజిత, కరస్పాండెంట్ అక్కినపల్లి సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం



ఖానాపురం : మండలంలోని దబ్బీరుపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో హిందీ భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణయ్య, హిందీ ఉపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ హిందీ భాష నేర్చుకోవాలని సూచించారు. ఆటపాటలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హిందీ బుక్స్, మెటీరియల్స్ బహూకరించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, లింగారెడ్డి, మదన్, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయం

నర్సంపేట రూరల్ : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. నర్సంపేట మండలంలోని ఆ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడాలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు శుభ్రతపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. హ్యాండ్‌వాష్ చేసుకోవాల్సిన తీరు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రియాజుద్దీన్, క్రాంతికుమార్, భవానీ చంద్, యాకూబ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై అవగాహన



కుమ్మరిగూడెంలో మాట్లాడుతున్న అధికారులు (ఫైల్)

- 'ప్రజాపాలన'లో దరఖాస్తుల స్వీకరణ

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద పేదలకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌పై ఆ శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు తక్కువ ధరకే విద్యుత్ కనెక్షన్ ఇచ్చే దిశగా కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే ప్రతినెలా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకుంటున్న వారికి ఉచితంగా సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. కొత్తగా ఇల్లు కట్టుకుంటునన్న, విద్యుత్ కనెక్షన్ లేని పాత ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 17 నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు అందించి ఉచిత విద్యుత్ సదుపాయం పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

250 నుంచి 500 వాట్స్ లోడ్ వరకు...

సాధారణంగా కిలో వాట్ లోడ్ సామర్థ్యంతో గృహ విద్యుత్ కనెక్షన్ కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ లోడును బట్టి కనీసం రూ.2 వేలు, అంతకు మించి డిమాండ్ డ్రాఫ్ట్ తీయాలి. కొందరు పేదలు డబ్బు చెల్లించలేని దుస్థితిలో ఉండగా తక్కువ ధరకే విద్యుత్ మీటరు ఏర్పాటు చేసి కనెక్షన్ ఇచ్చే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 500 వాట్స్ లోడ్ వరకు రూ.938, 250 వాట్స్ వరకైతే రూ.818 చొప్పున చెల్లించాలని నిర్దేశించింది. గ్రామానికి వచ్చే విద్యుత్ శాఖ అధికారులకు లేదా మండల అధికారులకు దరఖాస్తు చేస్తే సరిపోతుంది. వెంటనే మీటరు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇస్తారు.

విద్యుత్ చౌర్యానికి అడ్డుకట్ట

కొన్ని గ్రామాలు, కాలనీల్లో కొందరు కొండీలు వేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. ఇది చట్టరీత్యా నేరం. అధికారుల తనిఖీల్లో పట్టుబడితే తీవ్రతను బట్టి జరిమానా, ఇతర శిక్ష ఉంటుంది. కొండీ వేసే క్రమంలో విద్యుత్ ప్రమాదం జరిగి ప్రాణాపాయం చోటు చేసుకుంటే పరిహారం పొందే వీలుండదు. పైగా లోడ్ పెరిగి విగతా వినియోగదారులకు లోవోల్టేజీ సమస్యలు తలెత్తుతాయి. చౌర్యానికి పాల్పడే బదులు డబ్బు చెల్లించి కనెక్షన్ పొందితే ఉచిత విద్యుత్ పొందవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం

గృహలక్ష్మి పథకంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మండలంలోని కడారిగూడెం, కుమ్మరిగూడెం తదితర గ్రామాల్లో ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాం. ఇప్పటి వరకు 40 విద్యుత్ మీటర్లు అమర్చి ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. అర్హులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ సరఫరా పొందాలి.

–కన్న రాజు, ఏడీఈ, విద్యుత్ శాఖ

ఉద్యమాలతోనే కార్మికుల హక్కుల పరిరక్షణ

నర్సంపేట : ఉద్యమాల ద్వారానే కార్మికుల హక్కుల పరిరక్షణ సాధ్యమని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేశ్, జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ తెలిపారు. పట్టణంలోని సీయూటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన భవన నిర్మాణ రంగ కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్మికుల వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలను బోర్డు ద్వారా కాకుండా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. బోర్డులోని కార్మికుల డబ్బు నుంచి రూ.100 కోట్లను కార్యాలయ నిర్వహణ కోసం వెచ్చించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ మోసపూరిత విధానాలకు నిరసనగా ఈనెల 18న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా, 23న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణ, నాయకులు కందికొండ రాజు, కుమార్, భిక్షం, రాజు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ ఎన్నికలకు సహకరించాలి

- ఓటరు ముసాయిదా జాబితా ప్రదర్శన



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వర్ధన్నపేట : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీఓ వెంకటరమణ కోరారు. మండలంలోని 18 గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో వార్డుల వారీగా రూపొందించిన ఓటరు ముసాయిదా జాబితాను శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా కట్ర్యాల జీపీ కార్యాలయంలో కార్యదర్శి బస్సు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడారు. అసెంబ్లీ సాధారణ ఎన్నికల జాబితా ఆధారంగా పంచాయతీ రెండో సాధారణ 2024 ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా జాబితా రూపొందించినట్లు తెలిపారు. ఏవైనా తప్పులుంటే సవరణ కోసం ఈనెల 14 నుంచి 21 వరకు ఆయా గ్రామపంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.

రాయపర్తి : మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలో ఓటరు ముసాయిదాను అధికారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ గుగులోతు కిషన్ నాయక్ మాట్లాడారు. జాబితాలో పేర్లు సరి చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాశ్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ, భట్టు తండా, వడ్లకొండ తదితర గ్రామాల్లో ఓటరు ముసాయిదా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడారు. ఓటరు లిస్టు సవరణను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అత్తి రేవతికుమార్, మాజీ సర్పంచ్ ఆమడగాని రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని కొత్తూరు, తదితర గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాను అధికారులు ప్రదర్శించారు. జాబితాను సరిచూసుకొని తప్పులుంటే అధికారులకు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రాజయ్య

నర్సంపేట రూరల్ : గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎక్సైజ్ ఎస్సై రాజయ్య తెలిపారు. నర్సంపేటలోని సర్వాపురం రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద డివిజన్‌లోని ఆరు మండలాల గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాల కిట్ల వినియోగంపై శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మొదటి విడతలో డివిజన్‌లోని 33 మంది గీత కార్మికులకు రక్షణ కిట్లు మంజూరు చేశారని, రెండో విడత మరో 50 కిట్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను గీత కార్మికులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారులు భాస్కర్, నరేందర్, మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్, సర్వాపురం, ద్వారకపేట గౌడ సంఘాల అధ్యక్షులు శీలం వీరన్న, ట్రెయినర్లు తాళ్లపల్లి నర్సయ్య, నరేశ్, ప్రవీణ్, గోపగాని వెంకట్, మద్దెల సాంబయ్య, కొండి రాము, గంధసిరి సాంబరాజు, మర్థ సురేశ్, కక్కెర్ల నాగయ్య, పొగాకు రమేశ్, మనోహర్, సమ్మయ్య, పూజారి రాజు తదితరులు పాల్గొన్నారు.

సరైన పోషణతోనే బాలల వికాసం



భానోజీపేట అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్లు

నర్సంపేట రూరల్ : సరైన పోషణతోనే గర్భిణులు, బాలింతలు, బాలల శారీరక, మానసిక వికాసం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీరాణి, రమాదేవి తెలిపారు. నర్సంపేట మండలంలోని భానోజీపేట అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని, ఇతర సదుపాయాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, బాలలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కోమల, ఆశ కార్యకర్త సౌజన్య, కమిటీ సభ్యులు రమ, చంద్రమ్మ, స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు కొయ్యల మరియ, విజయ, సహాయకురాలు లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నతే 'మిషన్' లక్ష్యం



మాట్లాడుతున్న రమాదేవి

సంగెం : యుక్త వయస్సులో ఉన్న బాలికల ఉన్నతే లక్ష్యంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్ప పేరుతో 100 రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి తెలిపారు. మండలంలోని కాపుల కనపర్తిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పించేలా శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆమె అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు యుక్త వయసులో ఆకర్షణకు లోను కాకుండా బంగారు భవిష్యత్‌పై దృష్టి సారించాలని సూచించారు. తద్వారా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలరని చెప్పారు. శారీరక పరిశుభ్రత పాటించకుంటే తలెత్తే సమస్యలు, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. బాలల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చైల్డ్ లైన్, తదితర 1098, 181, 100, 14567, 1930 టోల్‌ఫ్రీ నంబర్ల వినియోగంపై వివరించారు. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబర్లను వినియోగించుకుని రక్షణ, సాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు సరికాదు

నర్సంపేట : ఆర్‌ఎంపీ, పీఎంపీలపై రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తున్న దాడులు సరికాదని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు నాటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చొరవతో విడతల వారీగా శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు మాత్రమే సత్వరమే ప్రాథమిక చికిత్స చేస్తూ ప్రాణాలను కాపాడుతున్నారని చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు మానుకుని వారి సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా కార్యాచరణ చేపట్టడంతోపాటు ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలని కోరారు.